క్లుప్తంగా

ఫిట్‌నెస్ లేని బస్‌లను సీజ్ చేయాలి

కల్వకుర్తి రూరల్: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాలల బస్సులను వెంటనే తనిఖీ చేసి సీజ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేరవేస్తున్న బస్‌లన్నింటిని తనిఖీ చేయాలన్నారు. సమస్యలున్న బస్‌లను గుర్తించి ఆ విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంతోష్ కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయి, రాము, కార్తీక్ ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్ ప్రాథమిక పాఠశాలలో పాలాది శివకృష్ణ తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన మాజీ జెడ్పీటీసీ సింగం బాలస్వామి గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జమీల్ అహ్మద్, కవిత పాల్గొన్నారు.

రైతుభరోసా కోసం బ్యాంకులో రైతుల క్యూ



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేయడంతో వాటిని తీసుకునేందుకు రైతులు గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు దగ్గరికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. రైతులు తరలిరావడంతో బ్యాంకు అధికారులు క్యూ పద్ధతి ఏర్పాటు చేశారు. దీంతో రైతులు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడ్డారు. 3 ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో జమ అయిన డబ్బులను డ్రా చేసి ప్రతి రైతుకు రూ.20 వేల నగదును బ్యాంకు అధికారులు అందజేశారు. బ్యాంకు మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతుభరోసా డబ్బులను ఆయా గ్రామాలలో బ్యాంకుమిత్రలతో తీసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి

వెల్దండ: మండలంలోని రాచూర్‌తండాలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, రమాకాంత్‌రెడ్డి, శంకరయ్య, పర్షా, ప్రశాంత్‌రెడ్డి, సోమ్లా, పత్య, రమేష్, రవీందర్, అంజి, రాజు, తిరుపతి, హరికిషన్, బిచ్చాని, సేవ్య, ఏఈ పల్లవి ఉన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం అజిలాపూర్, రాచూర్, లింగారెడ్డిపల్లి, సిలోనిబండతండా, గుండాల గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. మట్టి మిశ్రమాలను చిన్న బ్యాగుల్లో నింపి విత్తనాలను నాటాలన్నారు. మొత్తం 17వేల మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కొల్లాపూర్ రూరల్/లింగాల/తిమ్మాజిపేట: ఆయా మండల కేంద్రాలలో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్ రావు, జమీల్ అహ్మద్, ఖాన్, గోవింద్ గౌడ్, శంకర్‌రాథోడ్, రాజునాయక్, శివ, ముక్తార్, పూజారి వెంకటయ్య, తరుణ్, రాజుల్‌యాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, శ్రీనివాస్‌బహదూర్, ఉస్మాన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి రూ.9కోట్లు

- బాలుర నూతన కళాశాల నిర్మాణమే తరువాయి
- నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కృషి చేసిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



జిల్లా కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న బాలుర జూనియర్ కళాశాల

కందనూలు: నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మాణానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. కందనూలు నడిబొడ్డున ఉన్న కళాశాలలో 54 సంవత్సరాలకు పైగా ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యనందించి ఉన్నత స్థాయికి చేర్చింది. ఎందరో రాజకీయ నాయకులు, లాయర్లు, డాక్టర్లు, వ్యాపారస్తులు ఈ కళాశాలలో విద్యనభ్యసించారు. 1967వ సంవత్సరంలో వీఎస్ గౌడ్ ఉన్నత పాఠశాలకు శంకుస్థాపన చేశారు. 1969లో కేకే రెడ్డి జూనియర్ కళాశాలగా ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. ప్రస్తుతం 11 గదులలో 400 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఎన్నో సందర్భాలలో కళాశాలపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి చొరవతో దాదాపు 50 ఏళ్ల కళ నెరవేరింది. గత ప్రభుత్వాలకు ఎన్నో సందర్భాలలో వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఇన్నాళ్లకు నూతన జూనియర్ కళాశాల భవన నిర్మాణం కళ నెరవేరిందని కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు..



నేను ఈ కళాశాలలో ఫిబ్ర వరి 2021న ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నాను. అప్పటి నుంచి ఎన్నో సందర్భాలలో వివిధ పార్టీల నాయకులకు వినతిపత్రాలు అందించాం. స్థానిక ఎమ్మెల్యే చొరవతో కళాశాల నిర్మాణానికి ఉత్తర్వులు రావడం చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు

– మాధవి, ప్రిన్సిపాల్, బాలుర జూనియర్ కళాశాల, నాగర్‌కర్నూల్

పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం



నేను ఈ కళాశాలలో సీఈసీ రెండో సంవత్సరం చదువుతున్నాను. కళాశాల భవన నిర్మాణానికి ఉత్తర్వులు వచ్చాయని తెలిశాక చాలా ఆనందం కలిగింది. తొందరగా కళాశాల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలి. కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు, అధ్యాపకులకు ఇబ్బందులు తొలగుతాయి.

– మోహన్‌నాయక్, రాజాపూర్, కోడేర్

చాలా సంతోషం..



నేను ఈ కళాశాలలో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాను. సరైన సౌకర్యాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది.

– రామకృష్ణ, నాగనూలు, నాగర్‌కర్నూల్

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది..



చాలా సంవత్సరాల నుంచి శిథిలావస్థలో ఉన్న కళాశాలకు నిధులు మంజూరు కావడం సంతోషం. విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ విద్యనభ్యసిస్తున్నారు. రూ.9కోట్లు మంజూరయ్యాయి.తొందరలోనే పనులు ప్రారంభిస్తాం. – కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

సామాజిక సేవలే ధ్యేయం

కల్వకుర్తి రూరల్: సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతామని మిత్ర ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. గురువారం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిత్ర విద్యాభరోసా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరవింద చారి ఇద్దరు పిల్లలను పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో చేర్పించారు. పదో తరగతి వరకు ఖర్చులను ఫౌండేషన్ భరిస్తుందని పాఠశాల యాజమాన్యంతో చెప్పారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు చంద్రకాంత్ రెడ్డి, అధ్యక్షులు రసూల్ ఖాన్, శ్రీకాంత్, కార్తీక్, తరుణ్, మహేష్, అరవింద్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృత్యువాత

బల్మూర్: వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన కాడెద్దు విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తెల్జిరి శేఖర్ తన కాడెద్దులను బుధవారం రాత్రి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. గాలివాన దుమారానికి బెదిరిన పశువులు తెంచుకొని సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో షాక్‌కు గురై ఒక కాడెద్దు మృత్యువాత పడింది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు తక్కువగా ఉండటంతో ప్రమాదం సంభవించినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ శాఖ నుంచి పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

పొలాల్లో విద్యుత్‌వైర్లు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుత్ స్తంభాలకు అమర్చిన విద్యుత్‌వైర్లు చోరీకి గురైన సంఘటన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద వ్యవసాయ పొలాల్లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. కలెక్టరేట్ వెనుక కేఎల్‌ఐ కాల్వను అనుసరించిన ఉన్న వ్యవసాయ పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసి 6 విద్యుత్ స్తంభాల విద్యుత్ వైరును చోరీ చేశారు. దీంతో రైతుల వ్యవసాయ పొలాలకు సంబంధించి మోటార్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశిటిక్యాల మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యం పెంచాలి



కోడేరు: విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని తీగలపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు.

ముగిసిన బడిబాట

కోడేరు: మండల కేంద్రం, వివిధ పాఠశాలల్లో బడిబాట గురువారం ముగిసింది. అనంతరం సీపీఎస్, జీపీఎస్ పాఠశాలలో ఎంఈఓ భాస్కర్‌శర్మ విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

విద్యార్థులను చేర్చిన వికాస్ సంస్థ

కొల్లాపూర్ రూరల్: పట్టణాలనికి చెందిన 4 వార్డు పేద విద్యార్థులను పట్టణంలోని కాస్తూర్బా పాఠశాలలో వికాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కలమంద శేఖర్ చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇమ్మానియే ఉన్నారు.

మూగజీవాలకు రోగాలు రాకుండా ముందస్తు చర్యలు



పశుసంవర్ధక శాఖ డీడీ జ్ఞానశేఖర్

లింగాల: వానాకాలంలో మూగజీవాలకు రోగాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్ఞానశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని గురువారం డీడీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. మూగజీవాలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మా ట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో పశువులు, మేక లు, గేదెలు, గొర్రెలు తదితర మూగజీవాలకు వానాకాలంలో వచ్చే రోగాల నివారణకు ముందస్తుగా 5 రకాల వ్యాక్సిన్లను వేయించడం జరిగిందన్నారు. మూగజీవాలకు రోగాలు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి జిల్లాలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది రైతులకు, మూగజీవాల యజమానులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు తమ శాఖ ద్వారా 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఒక్కో రైతుకు 20 కిలోల వరకు పంపిణీ చేయడం జరుగుతుందని, గడ్డి విత్తనాలు కావల్సిన రైతులు అందుబాటులో ఉన్న పశువైద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. జిల్లాలో అంబట్‌పల్లి, వంగూర్‌లో మాత్రమే పశువైద్యాధికారుల పోస్టులు భర్తీ కావల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని పశువైద్య కేంద్రాలలో మందుల కొరత ఉందని, ఉన్న మందులతో వైద్య సేవలను అందిస్తున్నట్లు డీడీ తెలిపారు. లింగాల మండలంలో సబ్ సెంటర్లు లేక పోవడంతో మండలంలోని ఆయా గ్రామాలలో మూగజీవాలకు సకాలంలో వైద్య సేవలను అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



తరగతి గదిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి బషీర్ అహ్మద్

లింగాల: వర్షాకాలం కావడంతో విద్యార్థినులు రోగాల బారిన పడకుండా నాణ్యమైన భోజనం అందించాలని ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, డైనింగ్ హాల్, పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, తాజా కూరగాయలను వాడాలని, విద్యార్థినులు అస్వస్థతకు గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. తరచుగా వైద్య శిబిరం ఏర్పాటు చేయించాలని హెచ్‌ఎంకు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, సరుకులకు స్టాక్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగమ్మ ఉన్నారు.

కాంగ్రెస్ నేతకు కన్నీటి వీడ్కోలు




నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు: మాజీ సర్పంచ్ పాంగురంగారెడ్డి మరణం తీరని లోటని కన్నీరు మున్నీరయ్యారు. వంగూరు మండలం మిట్టసదగోడు గ్రామ మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి(54) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున ఏఐజీ ఆస్పత్రిలో మరణించారు. కాంగ్రెస్ పార్టీకి అండదండగా ఉండడమే కాకుండా అందరికీ అందుబాటులో ఉండేవాడని, ఆయన మరణవార్త వినగానే వంగూరు మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మిట్టసదగోడుకు చేరుకున్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ.. పాండురంగారెడ్డి మృతదేహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పారు. అంత్యక్రియల్లో వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ పండిత్ రావు, మాజీ వైస్‌చైర్మన్ అల్వాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అమెరికా, ఇజ్రాయిల్ మారణహోమం ఆపాలి



దాడులు ఆపాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ఇరాన్ పాలస్తీన దేశాలపై ఇజ్రాయిల్ అమెరికా దాడులు వెంటనే ఆపాలని సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 1948 ముందు ప్రపంచపటంలో ఇజ్రాయిల్ అనే దేశం లేదని, తలదాచుకోవడానికి ప్రవేశించి ప్రస్తుతం పాలస్తీనీయులపై దాడులకు పూనుకోవడం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా పాలస్తీన ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని అయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామయ్య, అశోక్, వెంకటేష్, మల్లికార్జున్, కురుమయ్య, రవి, సుధాకర్, మురళి, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జూలై9న సార్వత్రిక సమ్మె

నాగర్‌కర్నూల్ రూరల్: జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.న ర్సింహ నాయకులు పిలుపునిచ్చారు. గురువా రం జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవనంలో కిరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, లక్ష్మయ్య, మల్లేష్, శంకర్, వెంకటస్వామి, నీరజ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

కందనూలు: నాగర్‌కర్నూల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురు వారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మాధవి అధ్యక్షతన ఎమ్మెల్యే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత నాలుగుసార్లు ఈ కళాశాలను సందర్శించడం జరిగిందన్నారు. 1969లో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం ఇలాంటి దుస్థితిని చూసి చాలా బాధపడ్డానన్నారు. కొత్త భవనం నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషితో కళాశాలకు రూ.9 కోట్లు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిధుల మంజూరుతో పాటు వర్క్ ఆర్డర్ కూడా రిలీజ్ అయ్యిందన్నారు. అన్ని రకాల సౌకర్యాలతో జిల్లాలో ఎక్కడా లేని విధంగా కళాశాల నిర్మాణం చేపడతామన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైందని, జిల్లా కేంద్రంలో అన్ని రకాల విద్యాసదుపాయాలు కల్పించి పేద విద్యార్థులకు చదువు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ, కళాశాల అధ్యాపకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాడూరు: చదువుతోనే ఉన్నత స్థాయికి చేరవచ్చని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇంద్రకల్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మండలంలోని ఇంద్రకల్, లచ్చిరాంతండా, అంతారం గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన



దేవదారికుంట తండాలో విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఎంఈఓ

ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన ఉంటుందని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని దేవదారికుంట తండా ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన చిన్నారులతో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం లో ఎంఈఓ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో పాటు ఇంగ్లిష్ మీడియం ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు పడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా గ్రామంలోని ప్రభుత్వ బడిలో చదివించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నర్సింహారెడ్డి సొంత డబ్బులతో విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్సిళ్లు, పెన్నులు. బోధన పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ భాగ్యమ్మ, ఉపాధ్యాయుడు రత్నప్రసాద్, మాజీ సర్పంచు పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయాలని బీజేపీ ఆందోళన



బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మన్ననూర్: అస్తవ్యస్తంగా ఉన్న అమ్రాబాద్ మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లను అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై హోమం చేస్తూ వినూత్న నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఇదే గ్రామ పంచాయతీకి చెందిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని మండల కేంద్రానికి రెండు లేన్ల ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లను బాగు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు గోలి రాజు, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పగిడిపాల అనిల్, నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాల అమ్మకంపై ఆందోళన

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని మిలీనియం పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల సమీపంలో పుస్తకాల విక్రయాలకు తెరలేపింది. ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో పుస్తకాలు అమ్మే స్థలం వద్ద ధర్నా చే పట్టి ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎంఈఓ శంకర్‌నాయక్ పుస్తకాలు విక్రయిస్తున్న విషయాన్ని గుర్తించి వెంటనే ఆ షాపును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగ ర కార్యదర్శి వంశీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ల ప్రకారం పాఠశాలలలో ఎలాంటి పుస్తకాలు, మెటీరియల్ అమ్మరాదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్, మోహన్, సతీష్, పవన్, నందీశ్వర్ పాల్గొన్నారు.

ప్రైవేట్‌లో ఫీజులు నియంత్రించాలి

లింగాల: మండలంలోని ప్రైవేటు పాఠశాలలో ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని విద్యాధికారి బషీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మధు, శివప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌లో ‘పాస్‌పోర్టు’ తప్పిపోయింది

మన్ననూర్: హైదరాబాద్ నుంచి మన్ననూర్‌కు శ్రీశైలం వెళ్లే ఆర్టీసీ పికెట్ బస్సులో ప్రయాణం చేస్తున్న మన్ననూర్ గ్రామానికి చెందిన నసీరొద్దీన్ పాస్‌పోర్టు తప్పిపోయింది. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి మన్ననూర్‌కు వస్తున్న క్రమంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగును చోరీ చేశారు. బ్యాగులో కొన్ని వస్తువులతో పాటు పాస్‌పోర్టు కూడా ఉన్నట్లు తెలిపారు. ఎవరికైనా దొరికితే మన్ననూర్‌కు చెందిన మజీద్ కమిటీ సదర్ (మజీద్ కమిటీ పెద్ద) నసీరొద్దీన్ 9492942360 తెలియజేయాలని కోరారు.

విద్యార్థులను చేర్పించాలి

తెలకపల్లి: తమ పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జంగమోని గ్రామంలో ఇంటింటికి తిరిగి బడిబాట నిర్వహించారు. 15మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేష్, అనంద్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో తనిఖీ

చారకొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని నూకలచింతవాడిక, చంద్రాయన్‌పల్లి, గోకారం, దొంతులగుట్ట తండా, సారంబండతండాలో అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సీడీపీఓ భాగ్యమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో రికార్డులను పరిశీలించారు.

నేడు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక

లింగాల: తెలంగాణ ప్రభుత్వం క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న అర్హులైన విద్యార్థిని, విద్యార్థులకు మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బషీర్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎంపిక నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకావాన్ని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కోరారు.

ట్రాక్టర్ ఢీ: వ్యక్తికి గాయాలు

వంగూరు: మండలంలోని జాజాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. జాజాల గ్రామానికి చెందిన శ్రీనునాయక్ బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో శ్రీనునాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

తెలకపల్లి: మండలంలోని రైతులు రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ నర్మద గురువారం తెలిపారు. 2025 వానకాలానికి సంబంధించి కొత్తగా పట్టా పాసుబుక్కు పొందిన రైతులందరు ఈనెల 20న సాయంత్రం 5గంటలలోపు విస్తరణ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, అదే విధంగా రైతులు ఖాతాలు విస్తరణ అధికారులకు అందజేయాలని తెలిపారు.

ఇళ్ల జాబితాపై రీ వెరిఫికేషన్

తిమ్మాజిపేట: మండలంలోని బుద్ద సముద్రం గ్రామంలో ఫిర్యాదులు వచ్చిన ఇళ్ల జాబితాపై గురువారం అధికారులు రీ వెరిఫికేషన్ చేశారు. మండల వ్యవసాయ అధికారి గ్రామ ప్రత్యేకాధికారి కమల్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి విచారణ చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన వారికి ఇళ్లు రాలేదని కొందరు ఇటీవల కలెక్టర్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు మరో సారి క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి విచారణ నిర్వహించారు.

ఫీజుల పెంపు విరమించుకోవాలి

అచ్చంపేట: ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఇష్టం వచ్చినట్లు ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, డైరీలు స్కూల్ యూనిఫామ్, టై, బెల్ట్ అమ్మడంపై ఎంఈఓ జీవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి విరుద్ధంగా కొనసాగుతున్న అలాంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మధు, శివప్రసాద్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.